చిన్నకథ



# శిలావిగ్రహం

రచన: "కేరా"

ఆ సముద్రతీరాన ఉన్న పల్లెలో నాకు ఒక విచిత్రం కనిపించింది. మా బంధువు ఒకడు అక్కడ డాక్టరుగా... ప్రాక్టీసు చేస్తూండటంవల్ల... అక్కడికిపోతే అవకాశం లభించింది.

పల్లె ప్రజల జీవనం... చేపల వ్యాపారం. మంచిమంచి చేపలు... ఒక్కొక్కటి కనీసం మణుగు తూగేవికూడా ఉండేవి. వాళ్లు ఒక్కొక్కళ్లు కోటీశ్వరులనే చెప్పాలి... కాని ఆభాగ్యం అంతా... జానెడు గోచీ... బారెడు కండువాలోనే ఉంది. ఊరిపెద్ద ఒక్కడికి మాత్రం చిన్న పెంకుటిల్లు ఉంది.

సముద్ర తీరాన... అంటే... సుమారు దానికి రెండుమైళ్లే దూరంలో ఉంది. ఐనా అక్కడి ప్రజలు ఏవిచారంలేకుండా ఉన్నారంటే నాకే ఆశ్చర్యంవేసింది. అది వారి అదృష్టం అనుకుంటూ...

మా డాక్టరు అంటే ఊరిలో అందరికీ గౌరవం... సంతోషముతో తెచ్చియిచ్చింది నాగులు పెళ్లాం లక్కమ్మ... పెద్ద కొరమీను... దాన్నిచూస్తేనే నాకు తినాలనే యావ ఎక్కువయి పోయింది. ఇక తిన్న తర్వాత విషయం ఏంచెప్పాలి... చచ్చిం తర్వాత స్వర్గానికి పోతామంటారు. నిజమో ...అబద్ధమో తెలియదుకాని... ఆ కూర తిన్న తర్వాత నేను స్వర్గాన్ని చూసినమాట నిజం......

మా శాస్త్రిలుగారు చెప్పే వారు... వైకుంఠ ఏకాదశి నాడు...స్వర్గం తలుపులు బార్లాతీసి ఉంటాయి...ఆ రోజున చచ్చినవారికి స్వర్గంలోకి వెళ్లటానికి ఆటంకం ఉండదు...

అంతటి వీలువున్నా... దేవుడివంటి కాపిటలిస్టు—కనీసం ఒక్కొక్క ద్వారం దగ్గిర రెండేసి కుక్కలనన్నా కాపలా ఉంచకుండా, ఊరుకుంటాడా... కుక్కలంటే నాకు భయం... స్వతహాగా కాదు... మాచిట్టికి భయం... అందుకనే నాకూకూడా... మేం... యిద్దరం ఒకటిగా...

ఆ ఊరిలో నేనుచూసిన వింత విషయం (నా దృష్టిలో... కాని ఆ పల్లెప్రజలకు అది ఆచారం) ...“ఊరి మధ్యనే ఒక పెద్ద మామ్మ—రాత్రి విగ్రహం ఉంది... ప్రతి పండుగకీ దానికి పూజలు చేస్తారు... అంతగా పూజలు అందుకో తగ్గ ముసలి దేవత మన పురాణాల్లో ఎవ్వరూ లేరు... అంతా కుర్రకారు దేవుళ్లేగా...”

ఐతే ఆమామ్మ ఎంతో గొప్పదై వుండాలి.

ఆ విగ్రహానికి నమస్కరించిపోతున్న, సింగారి—మాంచి ఉషారుపిల్ల... ఏమన్నా నోరుజారి మాట అంటే ఎక్కడ కొడుతుందేమోనని భయం ...వాళ్లచేత మాత్రం అలాంటి దెబ్బలుతినే అదృష్టం... ఎవరికో ...అంటాడు మానరసు...నిజమేమో... కాని మాచిట్టి యింతవరకూ...అలాంటి పని చెయ్యలేదు.

ఇక మనమాట...సింగారిని అడిగాను “ఆ విగ్రహానికి నమస్కారాలు చేస్తారు......యెందుకే?”...

“ఏమో...బాబూ...మా పెద్దోళ్లు సెప్పారు ...సేస్తున్నాం...అంత కాని మాకేం తెల్సు...”

మళ్లీ మాట్లాడనియ్యకుండా వెళ్లిపోయింది. మనలో మనమాట...సింగారితో మాట్లాడటం... అంటే నాకు మంచి సరదా...

పెద్ద ఘటం...సుబ్బాయమ్మ దగ్గరకు చేరి అడిగాను.

"అది అంతా ఓ పెద్దరామాయణం...నాయనా..." అంది.

"తప్పదు...చెప్పాల్సిందే" అన్నా. ఇక సుబ్బాయమ్మ మామ్మ చెప్పటం ప్రారంభించింది. "ఊ" కొట్టాల్సిన అవసరంలేదు...ఆవిడ చెప్పుకు పోతూంటుంది. నువ్వు నిద్రపోయినా...లేచి వెళ్లి పోయినా ఆవిడ గమనించనే గమనించదు...చెప్పటం ఆవిడవంతు...వినకపోతే అది మన దురదృష్టం...

* * *

మొదటినుంచీ యీపల్లె యిక్కడలేదు. ఆ సముద్రం ఒడ్డున తాటితోపులో ఉండేది. అప్పట్లో పల్లెలో సింగ, బుంగలు మంచి పలుకుబడిలో వుండేవారు. అన్నదమ్ములు యిద్దరూ ఎంతోకలసి తిరిగినా...తల్లి మొదటినుంచీ అలాగే నేర్పింది...కాని పెళ్లిళ్లుజరిగి...ఆతర్వాత ఇంటి పోట్లాటలలో విరోధాలు పెంచుకొనేవారు...

ఎన్నోసార్లు చెప్పిచూసింది తల్లి. ఇద్దరు కోడళ్లు చెరిఒక వైపునా...ముసలిదాన్ని వేధించుకు తినేవారు.

"ముసలిదీ చావదేం?" అని పెద్దకోడలు.

"అంత అదృష్టమా...మనచేత ఎంత చాకరీ చేయించుకోవాలో" అని చిన్నది.

ముసలిదాని చావు విషయంలో ఇద్దరు కోడళ్లు ఒకేదారిన నడిచేవారు...

తిండి విషయంలో...మెళ్లో వేసుకునే నల్లపూసల దగ్గరనుంచీ...కూరదాకలదాకా కీచులాట, వీధినిబడి చేతి విరుపులు శాపనార్థాలు...ఒకళ్లనొకళ్లు తిట్టుకున్నా ఫరవాలేదు...మొగుళ్లను తిట్టటంకూడా అంతకంటె లేదు.

తిట్టటంలో యిద్దరూ ఒక్కలాగానే తిట్టేవారు...'నీఅత్తకడుపు...ఎప్పుడు కొలుతుందే...' నువ్వప్పుడు అణగారి పోతావే...' అని.

ఆతిట్ల పర్యవసానం...అవి యెవరికి అన్వయిస్తాయో వారికి తెలియదు. సామాన్యంగా చిన్న పిల్లలు...తక్కువజాతుల్లో తల్లిని '...ముండ...అని నీయమ్మ...' అనే తిట్లకున్న విలువే వీటికి కూడా ఉంది. తర్వాత ఆలోచించుకుంటే వారికే తెలుస్తుంది...కాని ఆ ఆలోచనజ్ఞానమే వారికి తక్కువ.

ముసలమ్మ ముంగిలా కూర్చునేది. పరువుబజారున అమ్ముతున్నారనేది కాని...అంతకంటె పల్లెత్తు మాటఅనేదికాదు...ఏమన్నాఅంటే ఆరోజునే ఆ ముసలమ్మను సీదాగా ప్రయాణంచేసి ... తలుపులు తెరచివుంటే స్వర్గానికి పంపించివెయ్యడం.


మదనకామేశ్వర లేహ్యము




బలవర్థకమయినది. మేహము నిక్కాక, నిస్సత్తువ, శుక్లనష్టము, అతిమూత్రము, మొదలగు వాటిని హరించి, మిక్కిలి బలమును, వీర్యవృద్ధిని, భోగశక్తిని కలిగించుటలో అప్రతిహతమయినది.

2 డబ్బీలు చాలును.

20 తులముల డబ్బీ రు. 2-0-0

రోజాపుష్ప లేహ్యము

మధురమయినది. మలబద్ధకమును ఖండించుటలో అమోఘమైనది. అజీర్ణము, గర్భవాయువు, మూలవ్యాధి, మొదలగు వాటిని హరించి కొలవిరేచనమును చక్కగా కలిగించును.

15 తు॥ డబ్బీ రు. 1-0-0 వి. పి. చార్జి ప్రత్యేకము.

అన్ని ఔషధముల క్యాటలాగు ఉచితం.

పి. సి. ఎ. అండు కంపెనీ,

ఆయుర్వేదసమాజం-పెరిదేపి, నెల్లూరుజిల్లా.

కోడుకులు కలగజేసుకోనంతకాలం...ముసలమ్మ కిందపడనేలేదు. కాని వాళ్ళప్రవర్తన కూడా ముసలమ్మ ప్రాణానికి భరింపరానిదైపోయింది.

'పెద్దకొడుకుని గదా ... నాదగ్గర వుండరాదా' అని పెద్దకొడుకు అనేవాడు. కాని అకోడలు ...నూటిపోటుమాటలు...దొంగదొంగ నవ్వులు... పెళ్లాంమీది అభిమానంచేత తల్లిమీదికి యుద్ధానికి వచ్చే పెద్దకొడుకు...ఇవే ముసలమ్మకు భరింపరానివైపోయాయి.

చిన్నకోడలికి యింకా మరికొంతఅభ్యుదయం వుండేది...మాటలుకావు... చేతిదెబ్బలే అవిడగారి ఆశయం...ముసలమ్మ ముసలిప్రాణం—ముచ్చటగా ఆదెబ్బల్ని భరించింది.

చిన్నకొడుకు పెళ్లాన్ని వెనకవేసుకు వచ్చేవాడు...కాడు...'అన్నీ నాపెళ్లాం చెయ్యగలదు. నాదాకా ఎందుకు' అని ఊరుకునేవాడు. నిజానికి వాడే వీరుడు అనిచెప్పాలి.

'ఆవిధంగా ముసలమ్మ బ్రతుకు తెల్లవారిందిగా—నాయనా' అంది సుబ్బాయమ్మగారు.

'నిజంగానే తెల్లవారిందమ్మా' అన్నా...నా శ్రద్ధకు మామ్మ అతిగా సంతోషించింది.

'ఆతర్వాత యేమయిందంటే...మామ్మ అందుకుంది 'ఇద్దరు కొడుకులూ...ముసలమ్మను ... వేరే గుడిసెవేసి వేరుపెట్టారు. తిండికి కూడా సరిగ్గా యిచ్చేవారుకాదు. అన్నీ సహించింది ... ఆఖరుకు ఓరోజున ముసలమ్మ స్వర్గానికి పోయింది.'

'ఆ' అన్నా.

'నిజమే' అంది మామ్మ.

ఆరునెలలు తిరుగకుండానే పెద్ద ఉప్పెన వచ్చి పల్లెఅంతా తుడుచుకుపోయింది. ముసలమ్మను యేడ్పించిన ఫలితం అన్నారు...ముసలిది చచ్చాక పడుచువాళ్ళ కళ్ళు తెరచుకున్నాయి. కోడళ్ళు పోట్లాటలు మానుకున్నారు.

మళ్ళీ యిక్కడికీవచ్చి పల్లె కట్టుకుని యీ ముసలమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠచేసి పూజలుచేస్తున్నారు... నాయనా' అంది.

అదీ కథలు......

---

'వాడేనండీ నా సైకిలును దొంగిలించాడు.'

'వాణ్ణి యెందుకు అరెస్టు చేయించలేదు.'

'సైకిలుకి కొత్తటైరులు వేయించేవరకూ వేచి ఉన్నానండీ.'

సంఘంలో శతాబ్దాలతరబడి వేళ్లు పాతుకుపోయిన ఒక దురాచారాన్ని అన్ని దృక్పథాలలోను చర్చించే ఒక అపూర్వమైన చిన్న గ్రంథం.

# పెళ్లికట్నం

'రాధ'

విడిప్రతి కావలసినవారు 0-4-0 స్టాంపులు పంపవలెను.

కథాంజలి ప్రచురణాలయం
32, కృష్ణప్పనాయకన్ టాంకుస్ట్రీట్ జి. టి. మదరాసు,

Edited and Published by A. N. Raghavachar, No. 32, Krishnappa Naick Tank St. G. T. Madras.
Printed by V. Kuppuswamy Chetty at Bharatamata Press 39, Anderson Street, G. T., Madras.